తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | ఆదివారం - 08 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 155 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



ఆరుతడి పంటలతో కరవును ఎదుర్కొందాం

హకీంపేట, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి, ఎండలు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. రాబోయే ఎనిమిది నెలలు గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని, రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, గతంలో ఈ సమయానికి నీటితో కళకళలాడే జలాశయాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కరవు పరిస్థితులను ప్రభుత్వం, రైతులు, ప్రజలంతా సమష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం హకీంపేట లో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించిన

మిగతా 2 లో..

- వచ్చే ఎనిమిది నెలలు అప్రమత్తంగా ఉండాలి: రేవంత్‌రెడ్డి
- ఎల్‌నినో ప్రభావంపై డిసెంబరులో శాసనసభ ప్రత్యేక సమావేశాలు
- నీటి లభ్యతను బట్టి పంటల సాగుకు ప్రణాళిక
- కొడంగల్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లతో పనులు



తెలంగాణ ప్రజలకు కేసీఆర్ దీపావళి శుభాకాంక్షలు

- పండుగ సందేశం అందించిన బీఆర్ఎస్ అధినేత
- అజ్ఞానపు చీకట్లు తొలగాలని ఆకాంక్ష
- బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచన
- రాష్ట్రం మళ్లీ ప్రగతి పథంలో సాగాలని ప్రార్థన



హైదరాబాద్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దీపాల పండుగ ప్రతి ఇంటా ఆనందం, సంతోషం నింపాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రజలంతా పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. దీపావళి పండుగ మనకు అందించే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, సమాజంలో సానుకూల ఆలోచనలు పెంపొందాలని ఆకాంక్షించారు. అజ్ఞానపు చీకట్లను తొలగించుకుని జ్ఞానకాంతులను ఆహ్వానించాలనే గొప్ప సందేశాన్ని దీపావళి పండుగ అందిస్తుందని కేసీఆర్ తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞానం, వివేకం, మంచితనం వైపు అడుగులు వేయాలని పండుగ సందేశం సూచిస్తోందని వివరించారు. దీపావళి వేడుకలు వ్యక్తిగత జీవితాల్లోనే కాకుండా సమాజంలోనూ ఆశావహ వాతావరణాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. దీపావళి ప్రత్యేక సంప్రదాయాల్లో భాగంగా బాణాసంచా కాల్చే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేసీఆర్ సూచించారు. ముఖ్యంగా పిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు పెద్దలు అప్రమత్తంగా ఉండాలని, కుటుంబ సభ్యులందరూ భద్రతా చర్యలు పాటిస్తూ పండుగ సంబరాలు నిర్వహించుకోవాలని కోరారు. ఆనందోత్సాహాల మధ్య ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పండుగ వేళ ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలని, అందరూ సురక్షితంగా వేడుకల్లో పాల్గొనాలని సందేశమిచ్చారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కేసీఆర్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తొలగిపోయి, ప్రతి కుటుంబానికి సర్వ సంపదలు చేకూరాలని ప్రార్థించారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు సహా అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ప్రజల జీవితాల్లో ఆర్థిక స్థిరత్వం, సామాజిక సౌభాగ్యం పెంపొందాలని, రాష్ట్రవ్యాప్తంగా శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం తిరిగి ప్రగతి పథంలో పయనించాలని, అభివృద్ధి రంగాల్లో మరింత ముందుకు సాగాలని కేసీఆర్ ప్రార్థించారు. లక్ష్మీదేవి అమ్మవారి కరుణాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రానికి సర్వతోముఖాభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరికీ కొత్త ఆశలు, ఉత్సాహం, శుభారంభాలను అందించాలని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని కేసీఆర్ తన శుభాకాంక్షల సందేశంలో కోరారు.



మహిళా రైతుల కష్టాలు తీర్చిన కవిత

- ఉదయం నుంచి విత్తనాల కోసం పడిగాపులు
- పోలేపల్లి రైతు వేదిక వద్ద రైతుల అవస్థలు
- కలెక్టర్ చంద్రశేఖర్‌తో కవిత ఫోన్‌లో చర్చ
- వెంటనే విత్తనాలు పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశం

చందంపేట, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):

వేరుశనగ విత్తనాల కోసం ఉదయం నుంచి ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్న మహిళా రైతుల పరిస్థితి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను కదిలించింది. డిండి ప్రాజెక్టు పరిశీలనకు వెళ్తున్న సమయంలో దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలం పోలేపల్లి రైతు వేదిక వద్ద పెద్ద సంఖ్యలో మహిళా రైతులు వేచి ఉండటాన్ని ఆమె గమనించారు. వారి ఇబ్బందులపై ఆరా తీశారు. అయితే సాయంత్రం డిండి నుంచి తిరిగి వస్తున్న సమయంలోనూ రైతులు అక్కడే ఉండటాన్ని గమనించి రైతు వేదికను సందర్శించారు. విత్తనాల కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్న మహిళా రైతుల పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించారు.

వేరుశనగ విత్తనాలు అందించకుండా అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మహిళా రైతులు కవితకు వివరించినట్లు సమాచారం. ఉదయం నుంచి రైతు వేదిక వద్ద వేచి ఉన్నప్పటికీ విత్తనాలు అందకపోవడంతో వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాల కోసం వచ్చిన రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని తెలిపారు. మహిళా రైతుల సమస్యలను విన్న కవిత వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విత్తనాల పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గత ఏడాది నల్గొండ జిల్లాలో 1,100 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయగా, ఈ ఏడాది కేవలం 600 క్వింటాళ్లు మాత్రమే కేటాయించడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కవిత కలెక్టర్‌కు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి విత్తనాల పరిమాణం తగ్గడంతో రైతులందరికీ సరిపడా విత్తనాలు అందడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉదయం నుంచి రైతు వేదిక వద్ద వేచి ఉన్న మహిళా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విత్తనాల పంపిణీలో ఆలస్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

కవిత వివరించిన సమస్యపై కలెక్టర్ చంద్రశేఖర్ స్పందించారు. ఉదయం నుంచి విత్తనాల కోసం ఎదురుచూస్తున్న మహిళా రైతులకు వెంటనే వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే సమయంలో ఇంకా విత్తనాలు అవసరమైన రైతుల పేర్లను నమోదు చేయాలని, అదనంగా ఎంత పరిమాణంలో విత్తనాలు అవసరమో అంచనా వేసి తమకు ప్రతిపాదన

మిగతా 2 లో..

హకీంపేటలో మెగా రైతు మేళా ప్రారంభం

- రైతు మేళాను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక పరికరాల ప్రదర్శన
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమల సాంకేతికతకు ప్రత్యేక స్థానం
- రైతులు మేళాను సందర్శించాలని ముఖ్యమంత్రి పిలుపు


హకీంపేట, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన మెగా రైతు మేళాను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని

మిగతా 2 లో..

సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి

- నారాయణగూడ–చప్పల్ బజార్‌లో వేడుకలు
- యాదవ సమాజం ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ
- ప్రత్యేక ఆకర్షణగా కేరళ దున్నపోతు 'బాహుబలి'
- సంప్రదాయాన్ని ఘనంగా కొనసాగిస్తున్న యాదవ సోదరులు

2 లో..



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఆరుతడి పంటలతో కరవును ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సీజన్‌లో వర్షాలు తక్కువగా కురవడంతో పాటు ఎండల తీవ్రత పెరుగుతోందని, వచ్చే జూలై వరకు పరిస్థితులు అనుకూలంగా ఉండకపోవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. పంటలు వేసే ముందు నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులు, కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు గోదావరి, కృష్ణా జలాల వినియోగంపై డిసెంబరులో రెండు మూడు రోజుల పాటు శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు. సంక్రాంతి తర్వాత ప్రజాబలం కార్యక్రమం చేపట్టి అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని, కష్ట కాలంలో రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై నా ముఖ్యమంత్రి మాట్లాడారు. గోదావరిలో నీరు పారుతున్నప్పుడు దాన్ని ఎత్తిపోసేందుకు బ్యారేజీలు ఎందుకని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడంతో కన్నెపల్లి పంపులు పనిచేయడం లేదని, మేడిగడ్డ గేట్లు మూసి 16 టీఎంసీల నీటిని నిల్వ చేసినప్పుడే ఎత్తిపోతలకు అవసరమైన నీరు పంపుహౌస్‌కు చేరుతుందని వివరించారు. తుపాకులగూడెం వద్ద నీటిని నిల్వ చేసి దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోస్తున్నామని, దిగువన ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారన్న విమర్శలను తోసిపుచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిధిలో నేరుగా ఆయకట్టు లేదని, ఆ మూడు బ్యారేజీలు సమర్థంగా పనిచేసినప్పుడే శ్రీపాద ఎల్లంపల్లికి నీరు చేరుతుందని పేర్కొన్నారు. దేవాదుల ద్వారా రైతులకు నీరందిస్తున్నట్లు చెప్పారు.

పాలమూరు జిల్లాలో స్వాతంత్ర్యం వచ్చిన ప్పటి నుంచి తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారం కాలేదని, పరిశ్రమలు కూడా ఆశించిన స్థాయిలో రాలేదని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జిల్లా ప్రజల జీవితాల్లో మార్పు వస్తుందని ఆశించినా కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాలు ముందుకు సాగలేదని వ్యాఖ్యానించారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తయి ఉంటే నల్గొండలో ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం లభించేదని పేర్కొన్నారు. అచ్చంపేట ఎత్తిపోతల, సీతారామసాగర్ ప్రాజెక్టులూ పూర్తికాలేదన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి, చేవెళ్ల, వికారాబాద్, తాండూరు వరకు నీటిని అందించాలని గతంలో ప్రణాళిక రూపొందించారని, దానిపై రూ.15 వేల కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయని, రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారని, ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లించి భూసేకరణ చేపట్టామని తెలిపారు.

కొడంగల్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. ఢిల్లీ-నోయిడా, ముంబయి-పుణె తరహాలో హైదరాబాద్ నుంచి లగచర్ల వరకు పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని, హైదరాబాద్ విమానాశ్రయం నుంచి కొడంగల్ వరకు 250 అడుగుల రహదారి నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ వ్యవసాయ ప్రాంత ఆర్థికాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వైద్య, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, నర్సింగ్, పశువైద్య, న్యాయ విద్యా సంస్థలతో పాటు యంగ్ ఇండియా సమీకృత పాఠశాల, సైనిక్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పారిశ్రామిక పార్కుల అభివృద్ధితో పాటు మొత్తం రూ.10 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు సాగునీరు అందడం, పంటలు పండడం, స్థానికులకు ఉపాధి లభించడం ద్వారానే ప్రాంత అభివృద్ధికి నిజమైన అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు.



ములుగు అభివృద్ధికి పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించాలి

- **జయేశ్ రంజన్‌తో మంత్రి సీతక్క సమీక్ష**
- **ప్రకృతి పరిరక్షణతో గిరిజనులకు ఉపాధి**
- **యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి**
- **ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

ములుగు, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): ములుగు జిల్లాలో అటవీ సంపదను పరిరక్షిస్తూనే పర్యావరణ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తొలిసారిగా ములుగు జిల్లాకు వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో ప్రకృతి వనరులు, పర్యాటక అవకాశాలను వినియోగించుకుంటూ స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆదివాసీ గిరిజనులకు జీవనోపాధి అవకాశాలు కల్పించవచ్చని మంత్రి సీతక్క పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. అటవీ ప్రాంతాల సహజ స్వరూపానికి నష్టం కలగకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాలు వారికి ఆర్థికంగా అండగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.అటవీ సంరక్షణకు ప్రాధాన్యమిస్తూనే ఏజెన్సీ గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని సీతక్క స్పష్టం చేశారు. మారుమూల గ్రామాలకు రహదారులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు అందించాలని కోరారు. గిరిజన చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలలు, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఏజెన్సీ గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవసరమైన కేంద్ర అటవీ అనుమతుల విషయంలో జాప్యం జరగకుండా చూడాలని మంత్రి కోరారు. రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి అత్యవసర పనులు అనుమతుల కారణంగా నిలిచిపోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అటవీ చట్టాలు, పర్యావరణ నిబంధనలను పాటిస్తూనే ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అన్నారు. ములుగు జిల్లాలో అటవీ పరిరక్షణ, గిరిజన సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా సాగాలని సీతక్క పేర్కొన్నారు. ప్రకృతి సంపదను భావితరాలకు అందించే బాధ్యతను గుర్తుంచుకుంటూనే ప్రస్తుత తరానికి మెరుగైన జీవన సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. పర్యావరణ పర్యాటకం ద్వారా గిరిజన కుటుంబాలకు ఆదాయం, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

మహిళా రైతుల కష్టాలు తీర్చిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

పంపాలని సూచించారు. దీంతో రైతుల అవసరాలను గుర్తించి తదుపరి కేటాయింపులపై చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడింది. విత్తనాల కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా వివరాలను సేకరించాలని అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే స్పందించి పోలేపల్లి రైతు వేదిక వద్ద విత్తనాల కోసం వేచి ఉన్న మహిళా రైతులకు వేరుశనగ విత్తనాల సంచులను పంపిణీ చేశారు. ఉదయం నుంచి ఎదురుచూస్తున్న తమకు సాయంత్రం విత్తనాలు అందడంతో రైతులు ఊరట చెందారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పంపిణీకి చర్యలు తీసుకున్న కవితకు మహిళా రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ ఏడాది గతంతో పోలిస్తే విత్తనాల కేటాయింపు తగ్గిన నేపథ్యంలో మిగిలిన రైతుల అవసరాలను గుర్తించి అదనపు విత్తనాల సరఫరాకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది కీలకంగా మారింది.

సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): దీపావళి పండుగను పురస్కరించుకుని నారాయణగూడ-చప్పల్ బజార్‌లో యాదవ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉత్సవాలు సందడి చేశాయని తెలిపారు. యాదవ సమాజం సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.



సదర్ ఉత్సవాల్లో అందంగా అలంకరించిన దున్నపోతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా కేరళకు చెందిన 'బాహుబలి' అనే భారీ దున్నపోతు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇతర దున్నరాజులను కూడా ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవ ప్రాంగణానికి తీసుకొచ్చారు. వాటి ఆకృతి, అలంకరణ, దృఢమైన శరీర సౌష్టవాన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. పిల్లలు, పెద్దలు దున్నపోతులతో సందడి చేస్తూ వేడుకలను ఆస్వాదించారు. సదర్ ఉత్సవాలు హైదరాబాద్ నగరానికి ప్రత్యేకమైన సంప్రదాయ వేడుకలుగా గుర్తింపు పొందాయి. యాదవ సోదరులు ఏడాది పొడవునా దున్నపోతులను ఎంతో శ్రద్ధతో పెంచి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వాటి ఆరోగ్యం, బలానికి తగిన ఆహారం అందిస్తూ దృఢంగా తీర్చిదిద్దుతారు. దీపావళి అనంతరం నిర్వహించే ఈ ఉత్సవాల్లో వాటిని ప్రజల ముందుకు తీసుకొచ్చి తమ పెంపకం, సంరక్షణలోని ప్రత్యేకతను చాటుకుంటారు. ఈ వేడుకలు కేవలం దున్నపోతుల ప్రదర్శనకే పరిమితం కాకుండా యాదవ సమాజ ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయి. బంధుమిత్రులు, బస్తీ పెద్దలు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఆడుతూ పాడుతూ ఉత్సవాల్లో పాల్గొంటారు. సంప్రదాయ దుస్తులు, ప్రత్యేక అలంకరణలు, సందడి వాతావరణంతో ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంటుంది. తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని యువత కూడా ఆసక్తిగా కొనసాగించడం విశేషం.హైదరాబాద్‌కే ప్రత్యేకమైన సదర్ ఉత్సవాలు నగర సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు సమాజంలోని ఐక్యతను, సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. యాదవ సోదరులు తమ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని ఎంతో ఉత్సాహంగా కొనసాగించడం అభినందనీయమని పేర్కొంటూ ఉత్సవాల్లో పాల్గొన్న వారితో ఆనందాన్ని పంచుకున్నారు.

అవయవదానంతో నలుగురికి పునర్జన్మ

- **మెదక్ ఆర్టీసీ కండక్టర్ అనిత మృతి**
- **మెదడు పనిచేయడం నిలిచిపోవడంతో కన్నుమూత**
- **భర్త అంజయ్య అంగీకారంతో అవయవాల దానం**
- **మరణంలోనూ ప్రాణదాతగా నిలిచిన మహిళ**





హైదరాబాద్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): మరణాన్ని జయించలేకపోయినా.. అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు మెదక్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కుమ్మరి అనిత (42). అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మెదడు పనిచేయడం నిలిచిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అయితే పుట్టెడు దుఃఖంలోనూ భర్త అంజయ్య గొప్ప నిర్ణయం తీసుకున్నారు. అనిత అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చి మరికొందరి జీవితాలకు కొత్త ఆశలు కల్పించారు. అనిత తన జీవితకాలంలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రతిరోజూ ఎంతోమంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో భాగస్వామిగా నిలిచారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించిన ఆమె, చివరికి మరణానంతరం కూడా తన అవయవాల ద్వారా ఇతరులకు ఉపయోగపడేలా నిలిచారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి కోలుకోలేని పరిస్థితికి చేరుకోవడం కుటుంబ సభ్యులను కలచి వేసింది. ఈ విషాద సమయంలోనూ ఆమె అవయవాలు మరికొందరికి జీవనాధారంగా మారే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు భావించారు.

భార్యను కోల్పోయిన బాధను దిగమింగుకుంటూ అంజయ్య అవయవదానానికి అంగీకరించడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. అనిత కిడ్నీలు, కళ్లను దానం చేసేందుకు కుటుంబం ముందుకు వచ్చింది. అవయవదానం ద్వారా నలుగురికి పునర్జన్మ లభించేలా చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఒక కుటుంబానికి తీరని లోటు ఏర్పడినప్పటికీ, మరో నాలుగు కుటుంబాల్లో ఆశలు చిగురించేలా ఈ నిర్ణయం నిలిచింది. అవయవదానం అనేది మరణానంతరం కూడా ఇతరుల జీవితాలను కాపాడే గొప్ప మానవతా కార్యం. ఒక వ్యక్తి తీసుకునే నిర్ణయం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి కొత్త జీవితం లభించే అవకాశం ఉంటుంది. అనిత కుటుంబం చూపిన చొరవ అవయవదానంపై సమాజంలో మరింత అవగాహన పెరగాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. ముఖ్యంగా ఆప్తులను కోల్పోయిన సమయంలోనూ ఇతరుల ప్రాణాలను కాపాడాలనే ఆలోచనతో ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చిన అనిత, తనువు చాలించిన తర్వాత కూడా ప్రాణదాతగా నిలిచి మానవత్వానికి నిదర్శనంగా మారారు. ఆమె కుటుంబం తీసుకున్న నిర్ణయం ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది. అనితకు పలువురు నివాళులర్పిస్తూ, ఆమె సేవలను గుర్తుచేసుకుంటున్నారు. దుఃఖంలోనూ అవయవదానానికి అంగీకరించిన భర్త అంజయ్య, కుటుంబ సభ్యుల త్యాగాన్ని సమాజం ఆదర్శంగా తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

హకీంపేటలో మెగా రైతు మేళా ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు పరిచయం చేయడంతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రదర్శించాలనే లక్ష్యంతో ఈ మేళాను నిర్వహిస్తున్నారు. రైతులకు ఉపయోగపడే పరికరాలు, పనిముట్లు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. వ్యవసాయ రంగంలో నూతన పద్ధతులపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.

మేళాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనశాలల్లో వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, పనిముట్లను ప్రదర్శించారు. పంటల సాగు నుంచి దిగుబడుల నిర్వహణ వరకు రైతులకు ఉపయోగపడే వివిధ రకాల ఉత్పత్తులకు చోటు కల్పించారు. వ్యవసాయంపై ఆధారపడిన పరిశ్రమలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కూడా ప్రదర్శనకు ఉంచారు. వీటితో పాటు పారిశ్రామిక ఉత్పత్తులు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సందర్శకులకు పరిచయం చేస్తున్నారు. ఒకే ప్రాంగణంలో వ్యవసాయం, పరిశ్రమలకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. రైతు మేళా ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహా, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, ఎంపీలు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహచర మంత్రులతో కలిసి ప్రదర్శనశాలలను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తులను పరిశీలించి, వాటి తయారీ, వినియోగం, ఉపయోగాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై ప్రదర్శనలో వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రైతులందరూ మెగా రైతు మేళాలో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను సందర్శించాలని ముఖ్యమంత్రి కోరారు. వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక మెళకువలు, నూతన పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సంప్రదాయ సాగు పద్ధతులతో పాటు ఆధునిక విధానాలను తెలుసుకోవడం ద్వారా వ్యవసాయ కార్యకలాపాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. రైతులు తమకు ఉపయోగపడే ఉత్పత్తులు, పరికరాల గురించి నేరుగా తెలుసుకునేందుకు ఈ మేళా వేదికగా నిలుస్తోంది.

వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాటి ఆధారంగా ఏర్పడుతున్న పరిశ్రమలు, వాటిలో వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ప్రదర్శించడం ఈ మేళాలో ప్రత్యేకతగా నిలిచింది. రైతులకు సాగు సంబంధిత సమాచారం అందించడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో వస్తున్న అభివృద్ధిని పరిచయం చేయడం ద్వారా విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. హకీంపేటలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ద్వారా రైతులు కొత్త పరికరాలు, ఉత్పత్తులు, ఆధునిక విధానాలను పరిశీలించి తమ సాగుకు అనువైన అంశాలను తెలుసుకునే అవకాశం కలగనుంది.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 08 - నవంబర్ 2026
వరంగల్ 03

కొండచిలువ కలకలం.. ఉలిక్కిపడ్డ స్థానికులు!

- పన్నెండు అడుగుల కొండచిలువ పట్టివేత.



సత్తుపల్లి, నవంబరు 7 (తెలంగాణ ముచ్చట్లు): పట్టణంలోని కృషి బైపాస్ రోడ్డులో ముళ్ల తీగల ఫ్యాక్టరీ సమీపంలో సుమారు పన్నెండు అడుగుల భారీ కొండచిలువ ప్రత్యక్షమవడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. రాత్రి సమయంలో కొండచిలువ కనిపించడంతో వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. సుమారు మూడు నెలల క్రితం ఇదే ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ల సమీపంలో ఉన్న పొదల్లో కొండచిలువ సంచరిస్తున్నట్లు స్థానికులు ఎమ్మెల్యే మట్టా రాగమయి, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహన కమల్ పాషా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి జేసీబీ సహాయంతో అపార్ట్‌మెంట్ల పరిసరాల్లో పేరుకుపోయిన పొదలు, ముళ్ల చెట్లను పూర్తిగా తొలగించి ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. అప్పట్లో సంచరిస్తున్న కొండచిలువ అక్కడి నుంచి వెళ్లిపోయింది. తాజాగా అదే ముళ్ల తీగల ఫ్యాక్టరీ రోడ్డు పరిసరాల్లో మరోసారి భారీ కొండచిలువ కనిపించడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. అటవీ శాఖ అధికారులు రాత్రివేళ స్పందించి కొండచిలువను సురక్షితంగా పట్టుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా పాములు కనిపిస్తే వాటిని పట్టుకునేందుకు ప్రయత్నించకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.


విద్యార్థుల జీవితాలతో వ్యాపారమా?.. ఫ్రాంక్‌ఫిన్ సంస్థపై ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం!



- ఉద్యోగాల పేరుతో భారీగా ఫీజుల వసూలు.. బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్

ఎల్కతుర్తి, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): ఫ్రాంక్‌ఫిన్ ఏవియేషన్ సంస్థ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఆ సంస్థ ద్వారా నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడానికి వెళ్లగా, కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రణీత్ గౌడ్ మాట్లాడుతూ, ఫ్రాంక్‌ఫిన్ ఏవియేషన్ సంస్థ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసి, అనంతరం సరైన ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బును ఫీజుల రూపంలో చెల్లించినప్పటికీ, విద్యార్థులకు ఆశించిన న్యాయం జరగకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ఇలాంటి విద్యాసంస్థల వ్యవహారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. సంస్థపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు వారు చెల్లించిన ఫీజులను తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ప్రణీత్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భానుప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మాలే బోయిన రామ్ చరణ్, రావుల చరణ్, ఆలేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో ఘనంగా దీపావళి వేడుకలు




- లక్ష్మీపూజలో పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

కరీంనగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన లక్ష్మీపూజ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాసం గణేష్, చాడగొండ బుచ్చిరెడ్డి, అడిషనల్ కమిషనర్లు వేణుమాధవ్, ఖాదర్ మోహియోద్దీన్, అయాజ్, అధికారులు, సిబ్బంది సునీల్ కుమార్, సుంచు నర్సయ్య, టి.వెంకటేష్, దుర్గం సంధ్య, తేజస్విని, హరిత, త్రివేణి, విజయలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

తిరుమలయ్య గుట్ట అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు

- వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి,నవంబర్07(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి పట్టణంలోని తిరుమలయ్య గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే మేఘారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు గుట్ట దిగువన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా తిరుమలయ్య గుట్ట అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, తెలంగాణ పర్యాటక శాఖ ద్వారా భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే గుట్టపైకి బోరు ద్వారా మంచినీటిని అందించేందుకు పైపులైన్ ఏర్పాటు పనులను తన సొంత ఖర్చులతో చేపడతానని హామీ ఇచ్చారు.తిరుమలయ్య గుట్టకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం భక్తులు ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి. కృష్ణ, మాజీ కౌన్సిలర్లు, పట్టణ, మండల, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ-ఏ హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదు

- వనపర్తిలో బీసీ-ఏ జేఏసీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన



వనపర్తి,నవంబర్07(తెలంగాణ ముచ్చట్లు): బీసీఏ వర్గాల హక్కులు, రిజర్వేషన్ అవకాశాలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలో శనివారం బీసీఏ జేఏసీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ జిల్లా కలెక్టరేట్ వరకు కొనసాగింది. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏవోకు నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ముదిరాజ్ కులాన్ని ప్రస్తుతం బీసీడి నుంచి బీసీఏలో చేర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బీసీఏ జాబితాలో ఉన్న 57 కులాలకు ఈ ప్రతిపాదన వల్ల రిజర్వేషన్ అవకాశాలు తగ్గి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రజక, వాల్మీకి, వడ్డెర, నాయీ బ్రాహ్మణ, మేదర, బెస్త, గంగపుత్ర, గంగిరెడ్డి తదితర వెనుకబడిన కులాలకు దక్కాల్సిన రిజర్వేషన్ ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీసీఏలో ని కులాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఏదైనా వర్గాన్ని మరో కేటగిరీలో చేర్చే నిర్ణయం తీసుకునే ముందు ఇప్పటికే ఆ జాబితాలో ఉన్న కుల సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం ముదిరాజ్ కులాన్ని బీసీఏలో చేర్చే ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.అనంతరం ఎమ్మెల్యే మేఘారెడ్డిని కలిసి బీసీఏలో ముదిరాజ్ కులాన్ని చేర్చడం వల్ల ఇప్పటికే ఆ వర్గంలో ఉన్న కులాలకు ఎదురయ్యే నష్టాలను వివరించి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రజక నాయకులు రంగస్వామి, పుల్లయ్య, గోపాల్, కృష్ణయ్య, పాండురంగ, బోయ నాయకులు వెంకట నారాయణ, మహేశ్వర్, నాయీ బ్రాహ్మణ నాయకులు నరేష్ కుమార్, రవి, నరేష్, వడ్డెర నాయకులు మోహన్ బాబు, కురుమూర్తి, ఈశ్వర్, మేదర తదితర బీసీఏ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో హనుమకొండ జిల్లాకు మూడో స్థానం..

- సత్తా చాటిన వేలేరు గురుకుల విద్యార్థులు



వేలేరు నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 కబడ్డీ పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు మూడో స్థానం సాధించింది. రాష్ట్రంలోని 33 జిల్లాల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో వేలేరు టీజీఆర్ఎస్ అండ్ జేసీ (బాలుర) గురుకుల కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కీలక పాత్ర పోషించి ప్రతిభ చాటారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థి సోంపెల్లి రోహిత్ తేజ హనుమకొండ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం విశేషం. చందు, విజయ్, రిత్విక్‌లు సైతం తమ ఆట తీరుతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. రౌతు అజయ్ కుమార్ విద్యార్థులను అభినందిస్తూ, క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు హర్షం వ్యక్తం చేశారు.





ప్రభుత్వ దవాఖానను సందర్శించిన సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా

- వైద్య సేవలు, మందుల నిల్వలపై ఆరా..
- ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టిన సర్పంచ్

ధర్మసాగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): మేజర్ గ్రామపంచాయతీ ధర్మసాగర్ పరిధిలోని ప్రభుత్వ దవాఖానను సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్‌ను కలిసి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు, రోజువారీగా వస్తున్నబహిరంగవైద్య సేవలరోగుల సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి వైద్య సేవల నిర్వహణ, ఆసుపత్రి అవసరాలపై చర్చించారు. ఆసుపత్రికి ఏవైనా అవసరాలు ఉన్నా, సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ముందు భాగంలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో పాముల సంచారం పెరిగిందని సిబ్బంది సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా యంత్రాన్ని రప్పించి ఆసుపత్రి ముందు భాగంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొట్టే భాను, గాజ శ్యామ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన నేతలకు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచులు



వేలేరు, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యలను వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బత్తుల శ్రీనివాస్, మాలోతు రాజు, మాలోతు అరుణ నాగరాజు, వేలేరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సర్పంచ్ జక్కుల మౌనిక ప్రత్యేక చొరవ



వేలేరు, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధికి గ్రామ సర్పంచ్ జక్కుల మౌనికసంపత్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా 2023 మే 7న ఆలయ పూజారికి గంగిరేగి చెట్టును బహూకరించి, స్వయంగా ఆలయ ప్రాంగణంలో నాటించారు. ప్రస్తుతం ఆ చెట్టు పెరిగి స్వామివారి నిత్య పూజా కార్యక్రమాలకు అవసరమైన గంగిరేగి ఆకులను అందించే స్థాయికి చేరుకుంది.

ఈ నేపథ్యంలో శ్రీ కొమురవెల్లి మల్లన్న స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన తరహాలోనే మల్లికుదుర్ల ఆలయంలోని గంగిరేగి చెట్టు చుట్టూ ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును తన సొంత నిధులతో భరిస్తానని ఆలయ ఈవో, పూజారులు, ఒగ్గు పూజారులకు తెలిపారు.

గ్రామ అభివృద్ధితో పాటు దేవాలయాల అభివృద్ధికి కూడా తన వంతు సహకారం అందిస్తానని సర్పంచ్ చూపుతున్న చొరవపై ఆలయ వర్గాలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంజనగిరి క్షేత్రంలో బీఆర్ఎస్ నేతల ప్రత్యేక పూజలు



ఖిల్లా ఘనపూర్,నవంబర్07(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలంలోని గట్టుకాడిపల్లి అంజనగిరి క్షేత్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని శనివారం బీఆర్ఎస్ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.ప్రతి నెల 7వ తేదీన నిర్వహించే ప్రత్యేక దర్శన కార్యక్రమంలో భాగంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. అంజనగిరి క్షేత్రంలో ప్రతి నెల 7వ తేదీన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ప్రత్యేక దర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నందున భక్తులు ప్రతి నెలా కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ముఖ్యంగా దంపతులు సతీసమేతంగా సంప్రదాయ దుస్తులు ధరించి కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. భజన కార్యక్రమాల్లో భక్తులు తమ భజన బృందాలతో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి నెల నిర్వహించే ఈ ప్రత్యేక దర్శన కార్యక్రమంలో భక్తుల భాగస్వామ్యం మరింత పెరగాలని, అందరూ స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఘనపూర్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, శశివర్ధన్ రెడ్డి, రాజప్రకాశ్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సమాధుల పండుగకు సర్వం సిద్ధం

- **నగరంలోని 10 స్మశానవాటికల్లో ఘనంగా ఏర్పాట్లు..**
- **పలు స్మశానవాటికలను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): ఆత్మీయుల జ్ఞాపకాలతో జరుపుకునే సంప్రదాయ దీపావళి సమాధుల పండుగకు సర్వం సిద్ధం చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో పూర్వీకుల గౌరవానికి, మానవ సంబంధాలకు ప్రతీకగా నిలిచే సమాధుల పండుగ సందర్భంగా శనివారం మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులు, సిబ్బందితో కలిసి వ్యవసాయ మార్కెట్ సమీపంలోని రెండు స్మశానవాటికలతో పాటు వల్లంపహాడ్ స్మశానవాటికను సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు.

స్మశానవాటికల్లో తిరుగుతూ పారిశుధ్య, చదును పనులను పరిశీలించారు. ఏర్పాట్ల విషయంలో పలు సూచనలు చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు మేయర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

గంగపుత్ర భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధుల కేటాయింపు

- **సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం..**
- **కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది: కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




కరీంనగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణంలో భాగంగా ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో గంగపుత్ర భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు కేటాయించిన సందర్భంగా కరీంనగర్ ఫిష్ మార్కెట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రదేశ్ కాంగ్రెస్ ఫిషరీస్ కమిటీ ప్రధాన కార్యదర్శి నాగుల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.గంగపుత్రుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గంగపుత్ర సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకేవీఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రీన్ దీపావళి వేడుకలు

ముల్కనూర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): ముల్కనూర్‌లోని ఏకేవీఆర్ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా గ్రీన్ దీపావళి కార్యక్రమాన్ని చేపట్టారు.బాణసంచా కాల్చడం వల్ల ఏర్పడే వాయు, శబ్ద కాలుష్యాన్ని నివారిస్తూ పర్యావరణహితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్ మాట్లాడుతూ.. దీపావళి వెలుగుల పండుగ అని, పర్యావరణానికి హాని కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్ దీపావళి కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యం పెంపొందించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.కాలుష్యరహిత దీపావళి.. ఆరోగ్యకరమైన సమాజానికి పునాది!

కాళేశ్వరం కూలేశ్వరం కాదు.. తెలంగాణ సాగునీటి అవసరాలకు కీలక ప్రాజెక్టు

- **అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు వెంటనే ప్రారంభించాలి.**
- **కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాఫర్ డ్యామ్ నిర్మించాలి – మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ డిమాండ్**



కరీంనగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో రాబోయే నీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులను ప్రభుత్వం తక్షణమే ప్రారంభించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. రాబోయే వేసవిలో తాగునీరు, సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మానకొండూర్‌లోని జి.వి. రామకృష్ణారావు నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని, మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులను వచ్చే ఏడాది జూన్ 28 నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలను ప్రస్తావించారు. మరమ్మతులు త్వరగా పూర్తి చేస్తామని చెబుతున్న ప్రభుత్వం గత మూడేళ్లుగా ఎందుకు జాప్యం చేసిందని ప్రశ్నించారు.

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక పేరుతో కాలయాపన

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) నివేదికను సాకుగా చూపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో కాలయాపన చేసిందని వినోద్ కుమార్ ఆరోపించారు. ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వమే యజమాని అని, అవసరమైన మరమ్మతులపై నిర్ణయం తీసుకుని చర్యలు చేపట్టాలని ఎన్‌డీఎస్‌ఏ తన తుది నివేదికలో సూచించిన ప్పటికీ రెండేళ్లపాటు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక అవసరం

నవంబర్ నుంచి జూన్, జూలై వరకు వర్షాలు లేని పరిస్థితుల్లో తెలంగాణలో తాగునీరు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ నాయకత్వం గత ఆరు నెలలుగా హెచ్చరిస్తోందన్నారు. పూర్వ కరీంనగర్ జిల్లాతో పాటు వరంగల్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మెదక్, నిజామాబాద్ జిల్లాల ప్రజలు, రైతులు నీటి కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కన్నెపల్లి వద్ద కాఫర్ డ్యామ్ నిర్మించాలి

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద తక్షణమే కాఫర్ డ్యామ్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మట్టి లేదా ఇసుకతో తాత్కాలిక కట్ట నిర్మించడం ద్వారా వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకోవచ్చని, ఇందుకు సుమారు రూ.60 నుంచి రూ.70 కోట్ల వ్యయం అవుతుందని ఇంజనీర్లు సూచించినట్లు తెలిపారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో నింపకుండా సాంకేతికంగా సురక్షితమైన స్థాయిలో నీటిని నిల్వ చేసి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు, అక్కడి నుంచి అన్నపూర్ణ, రంగనాయకసాగర్ ద్వారా హైదరాబాద్‌కు తాగునీరు అందించే అవకాశాలను పరిశీలించాలని కోరారు.

తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యతపై గతంలోనే అభ్యంతరాలు

తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యతపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే కేంద్ర జల సంఘం ప్రశ్నలు లేవనెత్తిందని వినోద్ కుమార్ గుర్తుచేశారు. తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరం వరకు సుమారు 116 కిలోమీటర్ల పరిధిలో ప్రాణహిత నదిలో అనేక ఉపనదులు, వాగులు కలుస్తాయని వివరించారు. ఈ ప్రాంతంలోని నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకునే మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా గోదావరి జలాలను వినియోగించుకోవాలంటే ఎత్తిపోతల ప్రాజెక్టులు తప్పనిసరని పేర్కొన్నారు.

గోదావరిపై ఆరు ప్రాజెక్టుల నిర్మాణం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో సుమారు 500 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మాత్రమే నిర్మించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ, సమ్మక్క-సారక్క, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందని వివరించారు. దేవాదుల ప్రాజెక్టుకు సమ్మక్క-సారక్క బ్యారేజీ ద్వారా నీటిని ఎత్తిపోసుకునే అవకాశం కలిగిందన్నారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాలే ముఖ్యం

కాళేశ్వరం ప్రాజెక్టును గతంలో 'కూలేశ్వరం' అంటూ విమర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే ప్రాజెక్టు బ్యారేజీల మరమ్మతుల అవసరాన్ని అంగీకరించారని వ్యాఖ్యానించారు. రాజకీయ విమర్శలు, వ్యక్తిగత కక్షలకు అతీతంగా తెలంగాణ ప్రజల తాగునీరు, సాగునీటి ప్రయోజనాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అన్నారం, సుందిళ్ల మరమ్మతులు వెంటనే ప్రారంభించి, కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాఫర్ డ్యామ్ నిర్మాణానికి ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.


"కాళేశ్వరం కూలేశ్వరం కాదు.. తెలంగాణ నీటి అవసరాలకు అత్యంత కీలకమైన ప్రాజెక్టు. ఇట్స్ నాట్ కూలేశ్వరం బట్ కాళేశ్వరం" అని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ సుడా చైర్మన్ జి.వి. రామకృష్ణారావు, రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రమేష్, పావని గౌడ్, ఆంజనేయులు, నాగి శేఖర్, పలువురు సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 08 - నవంబర్ 2026

ముల్కనూర్‌లో అంగరంగ వైభవంగా సదర్ ఉత్సవాలు





- **ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్.. సంప్రదాయ దున్నపోతుల ప్రదర్శనతో సందడి**

భీమదేవరపల్లి, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భీమదేవరపల్లి మండల యాదవ కులస్తుల సహకారంతో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ తన బృందంతో కలిసి ఈ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరించిన సదర్ దున్నపోతుల ను ముల్కనూర్ బస్టాండ్ నుంచి హైస్కూల్ మైదానం వరకు భారీ ర్యాలీగా తీసుకువచ్చారు. దున్నపోతుల విన్యాసాలు, జానపద కళాకారుల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలతో ముల్కనూర్ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువకులు, రాజకీయ నాయకులు, గ్రామస్తులు చిన్నాపెద్దా తేడా లేకుండా పెద్ద సంఖ్యలో హాజరై దున్నపోతుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

ఉత్సవాలకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదర్ ఉత్సవాల విశిష్టతను, యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతను కొనియాడారు. తరతరాలుగా వస్తున్న ఇటువంటి సంప్రదాయాలను భావితరాలకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతీకగా సదర్ వేడుకలు

యాదవుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే సదర్ ఉత్సవాలను గ్రామస్తులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో యాదవ కుల పెద్దలు, యువకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. ఉత్సవాలకు హాజరై విజయవంతం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, యాదవ సోదరులందరికీ యాదవ కులస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలను సమన్వయంతో ఘనంగా నిర్వహించిన జక్కుల అనిల్ బృందాన్ని పలువురు అభినందించారు.

కరీంనగర్ కిడ్స్ కేర్ సెంటర్‌లో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

- **సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేసిన చిన్నారులు**

కరీంనగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ కిడ్స్ కేర్ సెంటర్ & ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు సాంప్రదాయ దుస్తుల్లో ఎంతో ముద్దుగా అలంకరించుకుని, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులు “శుభ దీపావళి”, “హ్యాపీ దివాళి” అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం ప్రమిదలు వెలిగించి, రంగురంగుల రంగవల్లులు దిద్దుతూ పండుగ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు వేడుకల్లో చురుకుగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జక్కుల గిరిబాబు కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఉత్సాహపరిచి ఆశీర్వదించారు. దీపావళి పండుగ విశిష్టతను, చీకటిని పారద్రోలి వెలుగులు నింపే ఈ పండుగ అంతరార్థాన్ని పిల్లలకు వివరించారు.

పండుగ వాతావరణంలో చిన్నారుల ఆనందోత్సాహాల మధ్య వేడుకలు ఘనంగా ముగిశాయి.



కరీంనగర్ కిడ్స్ కేర్ సెంటర్‌లో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

- **సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేసిన చిన్నారులు**

కరీంనగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ కిడ్స్ కేర్ సెంటర్ & ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు సాంప్రదాయ దుస్తుల్లో ఎంతో ముద్దుగా అలంకరించుకుని, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులు “శుభ దీపావళి”, “హ్యాపీ దివాళి” అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం ప్రమిదలు వెలిగించి, రంగురంగుల రంగవల్లులు దిద్దుతూ పండుగ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు వేడుకల్లో చురుకుగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జక్కుల గిరిబాబు కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఉత్సాహపరిచి ఆశీర్వదించారు. దీపావళి పండుగ విశిష్టతను, చీకటిని పారద్రోలి వెలుగులు నింపే ఈ పండుగ అంతరార్థాన్ని పిల్లలకు వివరించారు.

పండుగ వాతావరణంలో చిన్నారుల ఆనందోత్సాహాల మధ్య వేడుకలు ఘనంగా ముగిశాయి.





సమసమాజ స్థాపన కోసం విద్యార్థులు ఉద్యమించాలి

- **విద్యారంగ పరిరక్షణకు పోరాటాలే మార్గం..**
- **పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్**

జమ్మికుంట, నవంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు): శాస్త్రీయ విద్యా విధానం, సమసమాజ స్థాపన, విద్యార్థుల హక్కుల సాధన కోసం పోరాడి అమరులైన విప్లవ విద్యార్థి అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలపై పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని, నేటి విద్యా రంగంలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు.

జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విప్లవ విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించి వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై అనుసరిస్తున్న విధానాలు విద్యార్థుల భవిష్యత్తుకు విఘాతం కలిగించేలా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, నాణ్యమైన శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి రావడం కోసం విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి కొనేటి ప్రశాంత్, డివిజన్ ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అశోక్, నాయకులు రాజేష్, శ్రావణ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.





సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

- **ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా**
- **రక్తదాన శిబిరం, అనాథ విద్యార్థులకు అన్నదానం, మొక్కల నాటకం**

జమ్మికుంట, నవంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు): జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా ఉంచి, సేవా కార్యక్రమాలతో అర్థవంతంగా నిర్వహిస్తూ జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆదర్శంగా నిలిచారు. తన పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పట్టణంలోని ఆటో డ్రైవర్ సోదరులకు గెలాక్సీ ఇన్సూరెన్స్ ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..ఆటో డ్రైవర్లు ప్రతిరోజూ రహదారులపై ప్రయాణిస్తూ ఎన్నో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటారని, అనుకోని ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తన సోదరుడు చింటూ తండ్రి చొక్కారపు శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి మృతి చెందారని, ఆ సమయంలో బీమా లేకపోవడంతో కుటుంబం అనేక ఇబ్బందులు ఎదుర్కొందని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితి మరే ఆటో డ్రైవర్ కుటుంబానికి రాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

పట్టణంలోని ఏ ఒక్క ఆటో డ్రైవర్ కూడా ప్రమాద బీమా లేకుండా ఉండకూడదని, ఆటో యూనియన్ అధ్యక్షులు, సభ్యులు బాధ్యత తీసుకొని ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మిత్రులు మేకల సాగర్ రెడ్డి, జక్కే శివ, చింటూతో పాటు ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు.

అదేవిధంగా జన్మదిన వేడుకల్లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీ సత్యసాయి మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు, భోజనం పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బొమ్మలగుడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, సేవా కార్యక్రమాల్లో ముందుండే నాయకుడిగా ప్రశాంత్ కుమార్ దిలీప్ జన్మదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన ఈ కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. వ్యక్తిగత వేడుకలను సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలుగా మలచడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



బాణాసంచా దుకాణాల్లో నిబంధనలు పాటించాలి

- **సిగరెట్, బీడీలు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**
- **ఎస్ఐ జి. నరేష్**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 7(తెలంగాణ ముచ్చట్లు): దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చింతకాని ఎస్ఐ జి. నరేష్ సూచించారు. బాణాసంచా దుకాణాల వద్ద ఎలాంటి అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

దుకాణాల వద్ద ఇసుక, నీటి డ్రమ్ములను అందుబాటులో ఉంచుకోవాలని, అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే నియంత్రించేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్, బీడీలు తాగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాణాసంచా దుకాణాల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.

నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా విక్రయాలు నిర్వహించినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత దుకాణదారులపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని దుకాణదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

పుస్తక పఠనంతోనే విజ్ఞానం..

ఆలోచనా శక్తి పెంపొందుతుంది





- **ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
- **జాతీయ పుస్తక వారోత్సవాల సందర్భంగా హనుమకొండలో పుస్తక ప్రదర్శన ప్రారంభం**
- **విద్యార్థులు, యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి**

హనుమకొండ, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): జాతీయ పుస్తక వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలోని అశోక కాంప్లెక్స్‌లో నవచేతన బుక్ హౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. పుస్తకం మనిషికి జీవితాంతం తోడుండే మంచి నేస్తమని, జ్ఞానాన్ని అందించే అమూల్యమైన సంపద అని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందడమే కాకుండా సమాజంపై అవగాహన, జీవితాన్ని చూసే దృక్పథం మెరుగుపడతాయని వివరించారు.ప్రస్తుత సాంకేతిక యుగంలో చరవాణులు, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్నప్పటికీ పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తకాలు చదవడానికి కేటాయించాలని సూచించారు. పుస్తకాలు కేవలం సమాచారాన్నే అందించవని, మనిషిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని తమ జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని, తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు నేర్పించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనలు పాఠకుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు రచయితలు, సాహితీవేత్తలు, పుస్తక ప్రియులకు చక్కని వేదికగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నవచేతన బుక్ హౌస్ నిర్వాహకులను అభినందించిన ఎంపీ, పుస్తక పఠన సంస్కృతిని మరింతగా ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ పుస్తక విభాగాలను సందర్శించిన డాక్టర్ కడియం కావ్య పలు రకాల పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించడంతో పాటు తనకు నచ్చిన పుస్తకాలను స్వయంగా కొనుగోలు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, సీనియర్ పాత్రికేయులు గడ్డం కేశవమూర్తి, గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ, వేణుమాధవ్, తోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ధర్మసాగర్ విద్యార్థికి స్వర్ణ పతకం

- **జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ తరపున ఎంపికైన గంగారపు ప్రభుదేవ్**
- **400 మీటర్ల పరుగు, 400 మీటర్ల రిలే విభాగాల్లో ప్రాతినిధ్యం**



ధర్మసాగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించాడు. కళాశాలలో సీఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న గంగారపు ప్రభుదేవ్ ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెం విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.
ఈ విజయంతో నవంబర్ 11వ తేదీన మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున ఎంపికయ్యాడు. 400 మీటర్ల పరుగు పందెంతో పాటు 400 మీటర్ల రిలే విభాగంలోనూ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్నాడు.
ప్రభుదేవ్ సాధించిన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి కళాశాలకు, తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. క్రీడలు కేవలం మానసిక, శారీరక ఉల్లాసానికే పరిమితం కావని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తు నిర్మాణానికి, ఉన్నత స్థాయికి ఎదగడానికి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడారంగంలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రత్యేక అవకాశాలతో పాటు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని దేశ కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అవకాశం ఉంటుందని వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ప్రభుదేవ్ తండ్రి గంగారపు శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు ప్రభాకర్, వెంకట్, గణేష్, సదానందం, రవళి, వేణు, చంద్రమౌళి తదితరులు పాల్గొని ప్రభుదేవ్‌ను అభినందించారు.



మానసిక వైకల్యం కలిగిన చిన్నారులతో దీపావళి వేడుకలు జరుపుకున్న ఎంపీ,ఎమ్మెల్యే

- **చిన్నారులకు స్వయంగా స్వీట్లు తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు**



హనుమకొండ, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): దీపావళి పండుగను పురస్కరించుకుని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యుడు కడియం శ్రీహరి మానవీయతను చాటుకున్నారు. హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక వైకల్యం కలిగిన చిన్నారులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకుని వారిలో ఆనందాన్ని నింపారు. ఈ సందర్భంగా హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేల నివాసానికి చేరుకున్న చిన్నారులు డాక్టర్ కడియం కావ్య, కడియం శ్రీహరిని కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించిన ఎంపీ, ఎమ్మెల్యే వారితో కొద్దిసేపు ఆనందంగా గడిపారు. అనంతరం చిన్నారులకు స్వయంగా స్వీట్లు తినిపించి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.చిన్నారులతో ఆప్యాయంగా మెలుగుతూ వారి ముఖాల్లో చిరునవ్వులు నింపిన కడియం కావ్య, కడియం శ్రీహరి ఆత్మీయత అక్కడి వారిని ఆకట్టుకుంది. పండుగ వేళ చిన్నారులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం ద్వారా మానవీయ విలువలు, సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పుస్తకాల పంపిణీ..

- **జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్**

ఖమ్మం బ్యూరో , నవంబర్ - 07 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలు అయిన గ్రూప్1, 2, 3 , గ్రూప్4 పరీక్షలు, అలాగే పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షల కొరకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ) అభ్యర్థులు తమ దరఖాస్తులను వి.వెంకటాయపాలెం లో గల కలెక్టరేట్ భవన సముదాయము లోరెండవ అంతస్తు ఎస్29 లోని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో నవంబర్ 10 వ తేదీ వరకు సమర్పించాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. ఇతర వివరాలకు మొబైల్ నెంబర్ 9704003002 ను సంప్రదించాలని జిల్లా మైనారిటి సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రాంపూర్‌లో అక్రమ గంజాయి రవాణా గుట్టురట్టు

- **ఇద్దరు నిందితుల అరెస్టు.. 1,145 గ్రాముల పొడి గంజాయి స్వాధీనం**
- **మధ్యప్రదేశ్ నుంచి గంజాయి తీసుకొచ్చి రాంపూర్ పరిసర ప్రాంతాల్లో విక్రయం**

ధర్మసాగర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రాంపూర్‌లోని మడేలయ్య దేవాలయ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో నిందితుల నుంచి 1,145 గ్రాముల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. అరెస్టయిన నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకొచ్చి రాంపూర్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో గుగులోత్ అకిల్ (24), నల్లబెల్లి జితేన్ (22)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 1,145 గ్రాముల పొడి గంజాయితో పాటు రెండు చరవాణులు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.



ఎమ్మెల్యే కడియం,ఎంపీ కావ్యకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కొలిపాక సతీష్

ఘన్‌పూర్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిపాక సతీష్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వారి



అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి చేరుకోవడంపై అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సందీప్ యాదవ్, నీల శ్రావణ్, శ్రీనివాస్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

- **ఆరు ఉద్యోగాల భర్తీకి 149 దరఖాస్తులు**

పెద్దపల్లి, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమాల అమలులో భాగంగా వివిధ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు సంబంధించిన తాత్కాలిక అర్హత, ప్రతిభా జాబితాలను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆయుష్ వైద్యాధికారులు, ఔషధ విక్రేతలు, మానసిక సామాజిక సలహాదారు, యోగా నిపుణుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ జాబితాలను పరిశీలించుకోవాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు. నియామక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతల ఆధారంగా దరఖాస్తులను పరిశీలించినట్లు వెల్లడించారు. జిల్లాలో ఆయుష్ వైద్యాధికారుల మూడు పోస్టులు, ఔషధ విక్రేత ఒక పోస్టు, మానసిక సామాజిక సలహాదారు ఒక పోస్టు, యోగా నిపుణుడు ఒక పోస్టు కలిపి మొత్తం ఆరు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నియామకాల కోసం మొత్తం 149 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ వివరించారు. వాటిలో ఆయుష్ వైద్యాధికారుల పోస్టులకు 115, ఔషధ విక్రేత పోస్టుకు 18, మానసిక సామాజిక సలహాదారు పోస్టుకు ఆరు, యోగా నిపుణుడి పోస్టుకు పది దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. పోస్టుల సంఖ్యతో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అభ్యర్థుల అర్హతలను నిబంధనల ప్రకారం పరిశీలించి జాబితాలను రూపొందించారు. నోటిఫికేషన్‌లో నిర్దేశించిన విద్యార్హతలు, ఇతర అర్హత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి పోస్టుకు విడివిడిగా తాత్కాలిక ప్రతిభా జాబితాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ జాబితాలను పెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు peddapalli.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి తమ దరఖాస్తుకు సంబంధించిన జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాలో తమ పేరు, వివరాలు, అర్హతలకు సంబంధించిన అంశాలను జాగ్రత్తగా సరిచూసుకోవాలని తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 08 - నవంబర్ 2026
వరంగల్ 07

చీకటిని పారద్రోలే దీపాల పండుగ.. దీపావళి!

- **చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపాల వేడుక**

డెస్క్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):
భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతిబింబంగా నిలిచే పండుగల్లో దీపావళికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. చీకటిని పారద్రోలుతూ వెలుగులను ఆహ్వానించే ఈ పండుగ ప్రతి ఇంట్లో ఆనందాన్ని, ప్రతి మనసులో కొత్త ఆశలను నింపుతుంది. కులమతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా దేశవ్యాప్తంగా ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే వేడుకగా దీపావళి ప్రత్యేక గుర్తింపు పొందింది. దీపం అనేది కేవలం వెలుగును ఇచ్చే సాధనం మాత్రమే కాదు.. అది జ్ఞానానికి, ఆశకు, విశ్వాసానికి, సానుకూల ఆలోచనలకు ప్రతీక. మనిషి జీవితంలో ఎదురయ్యే చీకట్లు ఎంతటి తీవ్రమైనవైనా వాటిని ధైర్యం, మంచితనం, ఆత్మవిశ్వాసంతో అధిగమించవచ్చనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది. అందుకే దీపావళిని కేవలం ఒక పండుగగా కాకుండా మానవ జీవితానికి వెలుగుదారి చూపించే ఆధ్యాత్మిక వేడుకగా భావిస్తారు. పండుగకు కొన్ని రోజుల ముందునుంచే ప్రతి ఇంట్లో సందడి మొదలవుతుంది. ఇళ్లను శుభ్రం చేయడం, గోడలకు రంగులు వేయించడం, పాత వస్తువులను తొలగించడం, కొత్త అలంకరణలు చేయడం వంటి పనులతో కుటుంబ సభ్యులంతా బిజీగా మారుతారు. ఇంటి గుమ్మాల ముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది, పూలతో అలంకరించి, సాయంత్రం వేళ మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించడం పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఒక చిన్న దీపం చుట్టూ ఉన్న చీకటిని తొలగించినట్లే.. మనిషిలోని అజ్ఞానం, అసూయ, ద్వేషం, స్వార్థం వంటి ప్రతికూల భావాలను తొలగించి ప్రేమ, కరుణ, మంచితనం, మానవత్వం అనే వెలుగులను నింపుకోవాలనే అంతరార్థం దీపావళి సందేశంలో దాగి ఉంది.




దీపావళి పండుగ వెనుక అనేక పౌరాణిక గాథలు, చారిత్రక విశేషాలు, ఆధ్యాత్మిక నమ్మకాలు ఉన్నాయి. రామాయణం ప్రకారం అయోధ్య రాజకుమారుడైన శ్రీరాముడు తండ్రి మాటను గౌరవించి పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేశాడు. ఆ సమయంలో సీతాదేవిని అపహరించిన రావణుడిపై యుద్ధం చేసి అతడిని సంహరించి, సీతాలక్ష్మణులతో కలిసి తిరిగి అయోధ్యకు చేరుకున్నాడు. తమ ప్రియమైన రాముడు తిరిగి వస్తున్నాడన్న ఆనందంతో అయోధ్య ప్రజలు పట్టణమంతా దీపాలు వెలిగించి స్వాగతం పలికారని ప్రతీతి. అప్పటి నుంచి దీపాలను వెలిగిస్తూ ఆనందాన్ని పంచుకునే సంప్రదాయం కొనసాగుతోందని విశ్వసిస్తారు. మరోవైపు శ్రీకృష్ణుడు నరకాసురుడనే రాక్షసుడిని సంహరించి ప్రజలకు విముక్తి కల్పించిన విజయానికి గుర్తుగా నరక చతుర్దశిని జరుపుకుంటారు. నరకాసురుడి చెరలో ఉన్న వేలాది మంది మహిళలకు విముక్తి కల్పించిన ఘట్టం ధర్మరక్షణకు ప్రతీకగా నిలిచింది. ఈ కథలన్నింటిలోనూ ఒకే ప్రధాన సందేశం కనిపిస్తుంది. అధికారం, అహంకారం, దుష్టత్వం ఎంత బలంగా ఉన్నప్పటికీ చివరకు ధర్మం, న్యాయం, మంచితనమే విజయం సాధిస్తాయని ఈ పండుగ మనకు గుర్తుచేస్తుంది. అంతేకాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో దీపావళిని విభిన్న సంప్రదాయాలతో జరుపుకుంటారు. కొన్నిచోట్ల లక్ష్మీపూజకు ప్రాధాన్యం ఇస్తే, మరికొన్ని ప్రాంతాల్లో శ్రీరాముడి అయోధ్యాగమనాన్ని గుర్తుచేసుకుంటారు. వ్యాపార వర్గాలు కొత్త లెక్కల పుస్తకాలను ప్రారంభించి సంపదకు ప్రతీకగా లక్ష్మీదేవిని పూజిస్తారు. ఇలా ఒకే పండుగ వివిధ ప్రాంతాల్లో విభిన్న ఆచారాలతో కొనసాగుతున్నప్పటికీ ప్రజలను ఏకం చేసే ఆధ్యాత్మిక భావన మాత్రం ఒక్కటే.
దీపావళి వచ్చిందంటే పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలోనూ ప్రత్యేకమైన సందడి కనిపిస్తుంది. పూల మార్కెట్లు, పండ్ల దుకాణాలు, మిఠాయిల విక్రయ కేంద్రాలు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతాయి. మట్టి ప్రమిదలు తయారు చేసే కుమ్మరి కుటుంబాలకు ఈ పండుగ ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. చిన్న చిన్న వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు దీపావళి సందర్భంగా వ్యాపార కార్యకలాపాలు పెరుగుతాయి. ముఖ్యంగా సంప్రదాయ పద్ధతిలో ప్రమిదలు తయారు చేసే కళాకారుల శ్రమకు ఈ సమయంలో మంచి గుర్తింపు లభిస్తుంది. ఆధునిక అలంకరణ వస్తువుల వినియోగం పెరుగుతున్నప్పటికీ మట్టి దీపాలకు ఉన్న ప్రత్యేకత మాత్రం తగ్గడం లేదు. మట్టి ప్రమిదలో నూనె పోసి వత్తి వెలిగించినప్పుడు కనిపించే ఆ ప్రశాంతమైన వెలుగు మన సంస్కృతిలోని సహజత్వాన్ని గుర్తుచేస్తుంది. పండుగ సందర్భంగా కొత్త దుస్తులు ధరించడం, ఇంటి పెద్దల ఆశీస్సులు తీసుకోవడం, బంధుమిత్రులను కలుసుకోవడం, స్వీట్లు పంచుకోవడం, కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించడం వంటి ఆచారాలు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయి. దూర ప్రాంతాల్లో నివసించే వారు సైతం పండుగ కోసం సొంత ఊళ్లకు చేరుకుని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. చిన్నారులకు దీపావళి అంటే కొత్త బట్టలు, మిఠాయిలు, దీపాలు, టపాసుల సందడి గుర్తుకొస్తే పెద్దలకు తమ బాల్యంలోని పండుగ జ్ఞాపకాలు గుర్తుకు వస్తాయి. ఒకప్పుడు ఇళ్ల ముందు వరుసగా మట్టి ప్రమిదలు వెలిగించడం, కుటుంబమంతా కలిసి పూజలు చేయడం, పొరుగువారికి మిఠాయిలు పంచడం వంటి సంప్రదాయాలు సామాజిక ఐక్యతకు నిదర్శనంగా ఉండేవి. ప్రస్తుతం జీవనశైలి మారుతున్నప్పటికీ ఆ సంప్రదాయాల విలువను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.
అయితే కాలక్రమేణా దీపావళి వేడుకల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సంప్రదాయ దీపాల వెలుగుల స్థానంలో విద్యుత్తు అలంకరణలు, సహజమైన ఆనందాల స్థానంలో అధిక శబ్దం చేసే టపాసుల వినియోగం పెరుగుతోంది. పండుగను ఘనంగా జరుపుకోవాలనే ఉత్సాహంలో కొందరు విచ్చలవిడిగా బాణసంచా కాల్చడం వల్ల వాతావరణంలో పొగ, విష పూరిత వాయువులు, సూక్ష్మ ధూళి కణాలు పెరుగుతున్నాయి. దీని ప్రభావం ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడేవారిపై పడుతోంది. శబ్ద కాలుష్యం వల్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, చిన్నపిల్లలు, పెంపుడు జంతువులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయి. బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలు, వినియోగం సమయంలో నిర్లక్ష్యం కారణంగా అగ్ని ప్రమాదాలు, కాలిన గాయాలు సంభవించే ప్రమాదం కూడా ఉంది. కొన్ని సందర్భాల్లో చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణ లేకుండా టపాసులు కాల్చడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. పండుగ మరుసటి రోజు రహదారులపై పేరుకుపోయే కాగితపు వ్యర్థాలు, ప్లాస్టిక్ పదార్థాలు, కాలిపోయిన బాణసంచా అవశేషాలు పరిసరాల పరిశుభ్రతకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పండుగను పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. సాధ్యమైనంత వరకు మట్టి ప్రమిదలు ఉపయోగించడం, తక్కువ కాలుష్యం కలిగించే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వడం, అనుమతించిన సమయాల్లోనే బాణసంచా వినియోగించడం, చిన్నారులను పెద్దల పర్యవేక్షణలో ఉంచడం అవసరం. కాలిన గాయాలు సంభవించినప్పుడు వెంటనే తగిన వైద్య సహాయం పొందాలి. టపాసుల వల్ల వచ్చే పొగను ఇతరులు పీల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మన ఆనందం ఇతరుల ఆరోగ్యానికి, ప్రశాంతతకు భంగం కలిగించకూడదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

భారత రాజకీయాల్లో చెరగని ముద్ర.. ఎల్.కే. అద్వానీ!

- **సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అగ్రనేతగా ఎదిగిన రాజకీయ ప్రస్థానం**
- **భారతీయ జనతా పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర**

డెస్క్, నవంబర్ 7(తెలంగాణ ముచ్చట్లు):
భారత రాజకీయ చరిత్రలో కొన్ని వ్యక్తుల ప్రస్థానం ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుంది. అలాంటి వారిలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు లాల్ కృష్ణ అద్వానీ ఒకరు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ, పార్టీ నిర్మాణం నుంచి దేశ రాజకీయాల్లో కీలక నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం ఆసక్తికరమైనది. 1927 నవంబర్ 8న అప్పటి బ్రిటిష్ భారతదేశంలోని సింధ్ ప్రాంతం కరాచీలో జన్మించిన అద్వానీ చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సామాజిక వ్యవహారాలపై ఆసక్తి పెంచుకున్నారు. విభజనకు ముందు భారతదేశంలో పెరిగిన ఆయన జీవితాన్ని దేశ విభజన తీవ్రంగా ప్రభావితం చేసింది. 1947లో భారతదేశ విభజన అనంతరం కుటుంబంతో కలిసి భారత్‌కు వలస వచ్చారు. సింధ్ ప్రాంతంలో విద్యాభ్యాసం కొనసాగించిన ఆయన తరువాత రాజకీయ, సామాజిక కార్యకలాపాల వైపు అడుగులు వేశారు. చిన్న వయసులోనే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో అనుబంధం ఏర్పరచుకున్నారు. సంఘ్‌లో పనిచేస్తూ క్రమశిక్షణ, సంస్థాగత నిర్మాణం, ప్రజలతో సంబంధాలు పెంపొందించుకోవడంపై దృష్టి సారించారు. ఆ తరువాత రాజకీయ రంగంలోకి ప్రవేశించి జనసంఘ్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. క్రమంగా పార్టీ వ్యవస్థలో వివిధ బాధ్యతలు చేపడుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం దేశ రాజకీయాల్లో ప్రభావవంతమైన నాయకుడిగా ఎదిగే వరకు కొనసాగింది. ఆయన జీవిత ప్రస్థానంలో వ్యక్తిగత పట్టుదలతో పాటు సంస్థాగత కృషి, రాజకీయ వ్యూహాలకు ప్రత్యేక స్థానం ఉంది.



అద్వానీ రాజకీయ ఎదుగుదలలో భారతీయ జనసంఘ్ కీలక పాత్ర పోషించింది. శ్యామా ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన జనసంఘ్‌లో ఆయన చురుకుగా పనిచేశారు. సంస్థాగత వ్యవహారాల్లో నైపుణ్యం, పార్టీ విధానాలపై అవగాహన, నాయకులతో సమన్వయం వంటి లక్షణాలతో ఉన్నత బాధ్యతలు చేపట్టారు. 1970లో తొలిసారిగా రాజ్యసభకు ఎన్నికై పార్లమెంటరీ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అనంతరం 1973లో జనసంఘ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రతిపక్ష నాయకులతో కలిసి పోరాటంలో పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన అరెస్టై నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. అత్యవసర పరిస్థితి అనంతరం 1977లో జనతా పార్టీ ఏర్పాటులో జనసంఘ్ విలీనమైంది. మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో అద్వానీ సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం జనతా పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తడంతో 1980లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది. అటల్ బిహారీ వాజపేయితో కలిసి అద్వానీ పార్టీ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ ప్రారంభ దశలో రాజకీయంగా అనేక సవాళ్లు ఎదురైనా సంస్థాగత బలాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. 1986లో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి కార్యకర్తలను సమన్వయం చేయడం, దేశవ్యాప్తంగా పార్టీ విస్తరణకు వ్యూహాలు రూపొందించడం వంటి కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ఆయన నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ క్రమంగా జాతీయ రాజకీయాల్లో తన ప్రాబల్యాన్ని పెంచుకుంది. పార్లమెంటులో పార్టీ ప్రాతినిధ్యం పెరగడం, వివిధ రాష్ట్రాల్లో రాజకీయంగా బలపడడం వెనుక ఆయన వ్యూహాత్మక పాత్ర ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు.
భారత రాజకీయాల్లో అద్వానీకి విస్తృతమైన గుర్తింపు తీసుకొచ్చిన అంశాల్లో రామజన్మభూమి ఉద్యమం ప్రధానమైనది. అయోధ్యలోని రామజన్మభూమి అంశంపై దేశవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఆయన 1990లో రథయాత్ర చేపట్టారు. గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య వరకు సాగాల్సిన ఈ యాత్ర దేశంలోని అనేక ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఈ ప్రయాణంలో ఆయనకు విస్తృత ప్రజా స్పందన లభించింది. అయితే యాత్ర బీహార్‌లోని సమస్తిపూర్ వద్ద అప్పటి ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ప్రభుత్వ హయాంలో నిలిపివేయబడింది. అద్వానీ అరెస్టయ్యారు. ఈ పరిణామం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. రామజన్మభూమి ఉద్యమం భారతీయ జనతా పార్టీ రాజకీయ ఎదుగుదలలో కీలక ఘట్టంగా మారింది. అదే సమయంలో ఈ ఉద్యమం దేశంలో రాజకీయ, సామాజిక, మతపరమైన చర్చలకు కూడా కేంద్రబిందువైంది. అయోధ్య వివాదం కారణంగా దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత ఘటన భారత చరిత్రలో వివాదాస్పద పరిణామంగా మిగిలింది. ఈ ఘటనకు సంబంధించిన రాజకీయ, న్యాయపరమైన చర్చలు దశాబ్దాల పాటు కొనసాగాయి. అద్వానీ ఆ ఉద్యమంలో కీలక నాయకుడిగా ఉన్నప్పటికీ, ఆయన పాత్రపై అనుకూల, ప్రతికూల అభిప్రాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఆయన రాజకీయ ప్రస్థానాన్ని విశ్లేషించేటప్పుడు ఆ ఉద్యమం పార్టీకి తెచ్చిన రాజకీయ బలంతో పాటు దేశ సామాజిక వాతావరణంపై చూపిన ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.
అద్వానీ రాజకీయ జీవితంలో మరో ముఖ్యమైన ఘట్టం కేంద్ర ప్రభుత్వంలో హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించడం. 1998 నుంచి 2004 వరకు అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 1998 నుంచి 1999 వరకు, తిరిగి 1999 నుంచి 2004 వరకు కేంద్ర హోంమంత్రిగా పనిచేశారు. దేశ అంతర్గత భద్రత, ఉగ్రవాద నిరోధక చర్యలు, సరిహద్దు భద్రత, పోలీసు వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు ఆయన పదవీకాలంలో ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. 2002లో ఉపప్రధానిగా బాధ్యతలు చేపట్టి ప్రభుత్వంలో రెండో అత్యున్నత రాజకీయ స్థానాన్ని నిర్వహించారు. వాజపేయితో ఆయనకు ఉన్న రాజకీయ అనుబంధం భారతీయ జనతా పార్టీ చరిత్రలో ప్రత్యేకమైనది. ఇద్దరూ కలిసి పార్టీని జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కీలకంగా పనిచేశారు. 2004లో జాతీయ ప్రజాస్వామ్య కూటమి ఎన్నికల్లో ఓటమి అనంతరం అద్వానీ ప్రతిపక్ష రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించారు. 2004 నుంచి 2009 వరకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రచారం నిర్వహించారు. అయితే ఆ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించలేకపోయింది. అనంతరం కూడా పార్టీ మార్గదర్శకత్వం, రాజకీయ సలహాలు, సంస్థాగత వ్యవహారాల్లో ఆయన తన అనుభవాన్ని అందించారు. దశాబ్దాల పాటు పార్లమెంటరీ రాజకీయాల్లో కొనసాగిన ఆయన పలు ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించారు. దేశ రాజకీయ పరిణామాలను ప్రభావితం చేసిన నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు.

వ్యాధుల గుర్తింపులో కీలకం.. రేడియోగ్రఫీ!




- **వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ఎక్స్‌రే ఆవిష్కరణ**
- **శరీరం లోపలి సమస్యలను చూపిస్తున్న ఆధునిక చిత్రీకరణ విధానాలు**

డెస్క్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):
వైద్య రంగంలో వ్యాధుల గుర్తింపు, చికిత్సా విధానాల అభివృద్ధికి రేడియోగ్రఫీ అందిస్తున్న సేవలు అపారమైనవి. మనిషి శరీరాన్ని బయట నుంచి పరిశీలించడం ద్వారా మాత్రమే అనేక వ్యాధులను గుర్తించడం సాధ్యం కాని పరిస్థితుల్లో శరీరం లోపలి భాగాలను స్పష్టంగా చూపించే వైద్య చిత్రీకరణ విధానాలు వైద్యులకు గొప్ప అవకాశాన్ని కల్పించాయి. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం నవంబర్ 8న ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1895 నవంబర్ 8న జర్మనీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఎక్స్‌రేలను కనుగొన్న సందర్భంగా ఈ రోజుకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన చేసిన ఆవిష్కరణ వైద్య చరిత్రలో ఒక గొప్ప మలుపుగా నిలిచింది. అప్పటివరకు శరీరం లోపల ఎముకలు విరిగాయా? ఏదైనా వస్తువు ఇరుక్కుందా? అంతర్గతంగా ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి? అనే విషయాలను తెలుసుకోవడానికి వైద్యులు అనేక పరిమితులను ఎదుర్కొనేవారు. ఎక్స్‌రేల ఆవిష్కరణతో శస్త్రచికిత్స చేయకుండానే శరీరంలోని అంతర్గత నిర్మాణాలను పరిశీలించే అవకాశం అందుబాటులోకి వచ్చింది. దీంతో వైద్య పరీక్షల విధానంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఈ ఆవిష్కరణకు గుర్తింపుగా రాంట్జెన్‌కు 1901లో భౌతిక శాస్త్రంలో తొలి నోబెల్ బహుమతి లభించింది. అప్పటి నుంచి వైద్య చిత్రీకరణ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతూ నేడు ఆధునిక వైద్య వ్యవస్థలో విడదీయలేని భాగంగా మారింది. రేడియోగ్రఫీ అనేది కేవలం ఎక్స్‌రేలు తీయడానికి మాత్రమే పరిమితమైన ప్రక్రియ కాదు. శరీరంలోని వివిధ అవయవాలు, ఎముకలు, కణజాలాల్లో చోటుచేసుకునే మార్పులను గుర్తించేందుకు ఉపయోగించే విస్తృతమైన వైద్య చిత్రీకరణ విధానాలకు ఇది ఆధారంగా నిలుస్తోంది. ఎముకలు విరగడం, కీళ్ల సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె పరిమాణంలో మార్పులు, దంత సంబంధిత సమస్యలు వంటి అనేక పరిస్థితులను గుర్తించడంలో ఎక్స్‌రే పరీక్షలు ఉపయోగపడుతున్నాయి. ఆధునిక వైద్యరంగంలో కంప్యూటెడ్ టోమోగ్రఫీ, మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్, అల్ట్రాసౌండ్, మామోగ్రఫీ వంటి అనేక చిత్రీకరణ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో ప్రతి విధానానికి ప్రత్యేకమైన ఉపయోగం ఉంది. ఎముకలు, అంతర్గత అవయవాల నిర్మాణాన్ని పరిశీలించేందుకు కంప్యూటెడ్ టోమోగ్రఫీ ఉపయోగపడుతుండగా, మెదడు, వెన్నుపాము, కండరాలు, మృదుకణజాలాలకు సంబంధించిన సమస్యలను గుర్తించడంలో మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్ కీలక పాత్ర పోషిస్తోంది. గర్భిణుల కడుపులోని శిశువు ఎదుగుదలను పరిశీలించేందుకు అల్ట్రాసౌండ్ పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడంలో మామోగ్రఫీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరీక్షల ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు వైద్యులకు సహకారం లభిస్తోంది. ఒకప్పుడు అత్యంత క్లిష్టంగా భావించిన అనేక వ్యాధుల నిర్ధారణ నేడు ఆధునిక చిత్రీకరణ సాంకేతికతతో మరింత సులభతరమైంది. వైద్య చిత్రీకరణ వెనుక రేడియాలజీ వైద్యులతో పాటు రేడియోగ్రాఫర్ల కృషి ఎంతో కీలకంగా ఉంటుంది. రోగికి అవసరమైన పరీక్షను సరైన పద్ధతిలో నిర్వహించడం, యంత్రాలను సురక్షితంగా ఉపయోగించడం, స్పష్టమైన చిత్రాలు పొందడం, రోగి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి బాధ్యతలను రేడియోగ్రాఫర్లు నిర్వర్తిస్తారు. ముఖ్యంగా ప్రమాదాల్లో గాయపడినవారు ఆసుపత్రులకు చేరుకున్నప్పుడు ఎముకల విరుగుడు, అంతర్గత గాయాలు, ఇతర సమస్యలను త్వరగా గుర్తించేందుకు వీరి సేవలు ఎంతో అవసరమవుతాయి. అత్యవసర విభాగాలు, ప్రమాద చికిత్స కేంద్రాలు, క్యాన్సర్ ఆసుపత్రులు, ప్రసూతి వైద్య విభాగాలు, ప్రత్యేక వైద్య కేంద్రాల్లో వీరి సేవలు నిరంతరం కొనసాగుతుంటాయి. వైద్యుడు సరైన నిర్ణయం తీసుకోవడానికి అవసరమైన చిత్రాలను అందించడంలో వీరి పాత్ర ప్రత్యేకమైనది. అయితే ఈ రంగంలో పనిచేసేవారు వికిరణాల ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలి. రక్షణ కవచాలు ధరించడం, అవసరమైన దూరం పాటించడం, పరీక్షా గదుల్లో భద్రతా ఏర్పాట్లు చేయడం, వికిరణ మోతాదును పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టాలి. రోగులకు కూడా అవసరమైనప్పుడే పరీక్షలు నిర్వహించాలి. వైద్యుల సూచన లేకుండా పదేపదే ఎక్స్‌రేలు తీయించుకోవడం మంచిది కాదు. ముఖ్యంగా గర్భిణులు పరీక్ష చేయించుకునే ముందు తమ పరిస్థితిని వైద్యులకు తెలియజేయాలి. అవసరమైన రక్షణ చర్యలతోనే పరీక్షలు నిర్వహించేలా చూడాలి. ఈ విధంగా రోగి భద్రతతో పాటు వైద్య సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.
సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ రేడియోగ్రఫీ రంగంలోనూ అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు ఎక్స్‌రే చిత్రాలను ప్రత్యేక చిత్రపటాలపై ముద్రించి పరిశీలించాల్సి వచ్చేది. వాటిని భద్రపరచడం, మరో ఆసుపత్రికి పంపించడం వంటి పనులకు ఎక్కువ సమయం పట్టేది. ప్రస్తుతం డిజిటల్ చిత్రీకరణ విధానాలు అందుబాటులోకి రావడంతో చిత్రాలను కంప్యూటర్లలో భద్రపరచడం, అవసరమైనప్పుడు పరిశీలించడం, వైద్యులకు వేగంగా అందించడం సాధ్యమవుతోంది. కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికత కూడా వైద్య చిత్రాలను విశ్లేషించడంలో సహాయపడుతోంది. కొన్ని సందర్భాల్లో చిత్రాల్లోని అసాధారణ మార్పులను గుర్తించి వైద్యుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ విధానాలు ఉపయోగపడుతున్నాయి. అయినప్పటికీ సాంకేతికత వైద్యుల అనుభవానికి ప్రత్యామ్నాయం కాదు. పరీక్షల ఫలితాలను రోగి ఆరోగ్య పరిస్థితి, లక్షణాలు, ఇతర వైద్య నివేదికలతో కలిపి పరిశీలించినప్పుడే సరైన నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆధునిక వైద్య చిత్రీకరణ సదుపాయాలు అందుబాటులోకి రావడం అవసరం. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రజలు చిన్నపాటి పరీక్షల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు పరీక్షల ఖర్చు భారంగా మారుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన యంత్రాలు, నిపుణులైన సిబ్బంది, నిర్వహణ సదుపాయాలను పెంచితే సామాన్యులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు అవసరమైన చిత్రీకరణ సౌకర్యాలను విస్తరించడంతో పాటు పరీక్షల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలి.ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వైద్య చిత్రీకరణ రంగంలో పనిచేస్తున్న నిపుణుల సేవలను గుర్తించడంతో పాటు ఈ విభాగం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యాధిని సకాలంలో గుర్తించడం అనేది సమర్థవంతమైన చికిత్సకు తొలి మెట్టు. అయితే ప్రతి చిన్న సమస్యకు అవసరం లేకుండా వైద్య చిత్రీకరణ పరీక్షలు చేయించుకోవడం కూడా సరైన పద్ధతి కాదు. వైద్యుల సూచన మేరకే పరీక్షలు చేయించుకోవాలి.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించండి

- **తెలంగాణ ఉద్యమకారులంతా ఐక్యంగా ముందుకు రావాలి**
- **ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి**
- **డా. పిడమర్తి రవి పిలుపు**




హనుమకొండ, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారుల సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి ఉద్యమ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులందరూ కలిసికట్టుగా పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌ను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర మరువలేనిదని, వారి త్యాగాలు, పోరాటాలు, కష్టాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు సంక్షేమ ఫలాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలు, రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారులందరూ ఒకే వేదికపైకి వచ్చి 250 గజాల ఇంటి స్థలం సాధన కోసం తమ ఐక్యతను చాటాలని డాక్టర్ పిడమర్తి రవి విజ్ఞప్తి చేశారు.

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కడియం కావ్య

- **ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి..**
- **ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలి**



హనుమకొండ, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని ఆమె పేర్కొన్నారు. దీపావళి దీపాల వెలుగులు ప్రతి ఇంటా ఆనందం, ఆప్యాయత, సిరిసంపదలను నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో నూతన ఆశలు, సరికొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని కోరుకున్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ మరింత ప్రగతిపథంలో పయనించాలని ఆకాంక్షించారు.పండుగ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. కాలుష్యాన్ని తగ్గించేలా జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా చిన్నారులు బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు అప్రమత్తంగా ఉండి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు.

వెలుగుల పండుగ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, సానుకూలతను నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.





ముగిసిన మహబూబాబాద్ డివిజన్ స్థాయి గిరిజన క్రీడా పోటీలు

- **కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్‌లో ఏహెచ్ఎస్ బి మహబూబాబాద్ జట్టుకు ప్రథమ స్థానం**

మహబూబాబాద్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): మహబూబాబాద్ డివిజన్ స్థాయిలో నిర్వహించిన గిరిజన క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు .ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా విభాగాల్లో ఏహెచ్ఎస్ బి మహబూబాబాద్ జట్టు ప్రథమ స్థానాన్ని సాధించి విజేతగా నిలిచింది. ఏహెచ్ఎస్ రెడ్యాల జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. పోటీలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి నిర్వాహకులు అభినందించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, జట్టుస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ క్రీడల అధికారి సీహెచ్. కొమ్ములు, మహబూబాబాద్ సెక్రెటరీ పోరిక అనిల్ కుమార్, వట్టం శంకర్, సర్పంచ్ లిప్సినారాయణ, సుమన్, రాజన్న, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లంపల్లి ఉపకేంద్రంలో అదనపు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- **ఐదు మెగావాట్ల సామర్థ్యంతో అదనపు యంత్రం ప్రారంభం**



భూపాలపల్లి, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): భూపాలపల్లి జిల్లాలో విద్యుత్తు సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్య చేపట్టారు. రామకృష్ణాపూర్ విభాగం పరిధిలోని 33/11 కేవీ వెల్లంపల్లి విద్యుత్తు ఉపకేంద్రంలో అదనంగా ఐదు మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్తు శక్తి పరివర్తకాన్ని శనివారం సాయంత్రం 4.10 గంటలకు విజయవంతంగా ప్రారంభించారు. భూపాలపల్లి పర్యవేక్షక ఇంజినీరు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ పూర్తయింది. దీంతో ఉపకేంద్రం విద్యుత్తు పరివర్తన సామర్థ్యం పెరిగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్తు నిర్వహణ విభాగం, సాంకేతిక విభాగం, కొలతలు మరియు పరీక్షల విభాగం, నిర్మాణ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. చిట్యాల, రామకృష్ణాపూర్ ప్రాంతాల సహాయ ఇంజినీర్లు, ఇతర సిబ్బంది కూడా హాజరయ్యారు. అధికారుల సమక్షంలో పరివర్తకానికి విద్యుత్తు అనుసంధానం చేసి, దాని పనితీరును పరిశీలించారు. నిర్ణీత ప్రక్రియలను అనుసరించిన అనంతరం అదనపు పరివర్తకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు.

ప్రణాళిక లేని పట్టణాభివృద్ధి.. ప్రజలకు తప్పని ఇక్కట్లు!

- **పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాల విస్తరణ అవసరం**
- **రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలే అభివృద్ధికి పునాది**
- **చెరువులు, పచ్చదనం కాపాడితేనే ఆరోగ్యకరమైన నగరాలు**
- **భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రణాళికలు రూపొందించాలి**



డెస్క్, నవంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు): పల్లెల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు, మెరుగైన విద్య, వైద్యం, రవాణా సదుపాయాల కోసం ప్రజలు నగరాల వైపు అడుగులు వేస్తుండటంతో పట్టణాల జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో నివాస ప్రాంతాలు విస్తరిస్తున్నాయి.కొత్త కాలనీలు, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. అయితే జనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందకపోవడం అనేక సమస్యలకు కారణమవుతోంది. రహదారులపై ట్రాఫిక్ రద్దీ, తాగునీటి కొరత, మురుగునీటి పారుదల సమస్యలు, చెత్త నిర్వహణలో లోపాలు, పార్కుల కొరత వంటి సమస్యలు పట్టణ ప్రజలను నిత్యం వేధిస్తున్నాయి. పట్టణాభివృద్ధి అంటే కేవలం పెద్ద పెద్ద భవనాలు నిర్మించడం, విశాలమైన రహదారులు వేయడం మాత్రమే కాదు. ప్రజలు ప్రశాంతంగా, ఆరోగ్యంగా, సురక్షితంగా జీవించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను సమగ్రంగా కల్పించడమే నిజమైన అభివృద్ధి. భవిష్యత్తులో పట్టణాల జనాభా ఎంత పెరుగుతుంది? అందుకు ఎంత నీరు అవసరం? ఎన్ని రహదారులు కావాలి? ఆసుపత్రులు, పాఠశాలలు ఎక్కడ నిర్మించాలి? వర్షపు నీరు ఎక్కడికి వెళ్లాలి? వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించాలి. ఈ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి ప్రతి సంవత్సరం నవంబర్ 8న ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.ప్రణాళికాబద్ధమైన నగరాల నిర్మాణం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చనే సందేశాన్ని ఈ రోజు అందిస్తోంది.

పట్టణ ప్రణాళిక అనేది ఒక నగరం భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన ప్రక్రియ. జనాభా పెరుగుదల, భౌగోళిక పరిస్థితులు, పర్యావరణ అవసరాలు, రవాణా సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలను పరిగణనలోకి తీసుకుని నగర నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవాలి. నివాస ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, పారిశ్రామిక ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రజా వినోద కేంద్రాలు ఎక్కడ ఉండాలో ముందుగానే నిర్ధారించాలి.ఒక ప్రాంతంలో భారీగా నివాస భవనాలు నిర్మిస్తున్నప్పుడు అక్కడి రహదారుల సామర్థ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్తు, మురుగునీటి వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయాలి. లేకపోతే కొన్నేళ్లకే ఆ ప్రాంతం సమస్యలతో సతమతమవుతుంది. ముఖ్యంగా రహదారుల నిర్మాణంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి. పాదచారులకు ప్రత్యేక మార్గాలు, సైకిళ్ల కోసం సురక్షితమైన దారులు, ప్రజా రవాణా వాహనాలకు అనువైన మార్గాలు ఏర్పాటు చేయాలి. నగరాల్లో వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించి ప్రజా రవాణాను ప్రోత్సహిస్తే ట్రాఫిక్ సమస్యతో పాటు వాయు కాలుష్యాన్ని కూడా కొంతవరకు నియంత్రించవచ్చు. పట్టణాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడం, రహదారుల కూడళ్లను శాస్త్రీయంగా అభివృద్ధి చేయడం, వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలాలు కేటాయించడం కూడా పట్టణ ప్రణాళికలో భాగం కావాలి. భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలి.అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో వాటి ప్రభావం మొత్తం పట్టణ వ్యవస్థపై పడుతుంది.

నగరాల అభివృద్ధిలో పచ్చదనం, ప్రకృతి పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకప్పుడు పట్టణాల చుట్టూ విస్తారమైన పొలాలు, చెట్లు, చెరువులు, వాగులు కనిపించేవి. కాలక్రమేణా జనాభా పెరుగుదల, నిర్మాణాల విస్తరణతో అనేక సహజ వనరులు కనుమరుగవుతున్నాయి. చెరువులను పూడ్చివేసి భవనాలు నిర్మించడం, వాగుల మార్గాలను ఆక్రమించడం, రహదారుల విస్తరణ పేరుతో పెద్ద సంఖ్యలో చెట్లను తొలగించడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఫలితంగా వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాకాలంలో వరదలు సంభవించడం, భూగర్భ జలమట్టాలు తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చెరువులు, కుంటలు, నాలాలు పట్టణాలకు సహజమైన రక్షణ వ్యవస్థలుగా పనిచేస్తాయి. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం, వరద ముప్పును తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తాయి. వాటి సహజ ప్రవాహ మార్గాలను అడ్డుకుంటే భారీ వర్షాల సమయంలో కాలనీలు నీటమునిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల చెరువుల పరిరక్షణ, వర్షపు నీటి నిర్వహణ, మొక్కల పెంపకం, ఉద్యానవనాల అభివృద్ధికి పట్టణ ప్రణాళికల్లో ప్రత్యేక స్థానం కల్పించాలి. ప్రతి నివాస ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండే పార్కులు, పిల్లలు ఆడుకునే ప్రదేశాలు, వృద్ధులు నడిచేందుకు అనువైన మార్గాలు ఉండాలి. రహదారుల వెంట చెట్లు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. భవనాల నిర్మాణంలోనూ సహజ గాలి, వెలుతురు అందేలా ఏర్పాట్లు చేయాలి. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయకుండా ప్రకృతితో కలిసి జీవించే నగరాలను నిర్మించడమే అసలైన పట్టణ ప్రణాళిక లక్ష్యం కావాలి.

పట్టణాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ సమానమైన మౌలిక సదుపాయాలు అందించడం కూడా ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. సంపన్నులు నివసించే ప్రాంతాల్లో విశాలమైన రహదారులు, మెరుగైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థలు కనిపిస్తుంటే పేదలు నివసించే కొన్ని ప్రాంతాల్లో కనీస సదుపాయాలు కూడా అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయి. మురికివాడల్లో నివసించే ప్రజలు పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, డ్రైనేజీ, చెత్త సేకరణ వంటి సదుపాయాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాభివృద్ధి ప్రణాళికలు రూపొందించేటప్పుడు ఇలాంటి ప్రాంతాలను విస్మరించకూడదు. ప్రతి ఒక్కరికీ అందుబాటు ధరల్లో గృహాలు లభించేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రజా గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, మార్కెట్లు ప్రజలకు సులభంగా చేరుకునే దూరంలో ఉండాలి. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు సురక్షితంగా ప్రయాణించేందుకు అనువైన నిర్మాణాలు చేపట్టాలి. వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న నగరాలుగా పట్టణాలను తీర్చిదిద్దాలి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు వేగంగా చేరుకునేందుకు రహదారులు అందుబాటులో ఉండాలి. పట్టణాల్లో చెత్త నిర్వహణకు శాస్త్రీయ విధానాలను అమలు చేయాలి. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పునర్వినియోగం, శుద్ధి ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మురుగునీటిని శుద్ధి చేసి అవసరమైన చోట తిరిగి వినియోగించే విధానాలను ప్రోత్సహించాలి. ఈ చర్యలన్నీ సమర్థంగా అమలైనప్పుడే పట్టణాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు వరంగల్, హనుమకొండ, కరీంనగర్, ఖమ్మం వంటి పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నాయి. విద్య, వైద్యం, ఉపాధి, వాణిజ్య రంగాల్లో అభివృద్ధి పెరుగుతున్న కొద్దీ పట్టణాలపై జనాభా ఒత్తిడి కూడా అధికమవుతోంది. ముఖ్యంగా హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో కొత్త నివాస కాలనీలు, వాణిజ్య సముదాయాలు పెరుగుతున్న నేపథ్యంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సరఫరా, పార్కులు, చెరువుల పరిరక్షణ వంటి అంశాలపై దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. నగరాల విస్తరణలో పాత చెరువులు, చారిత్రక కట్టడాలు, ప్రకృతి వనరులకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పట్టణాభివృద్ధి సంస్థలు, పురపాలక సంస్థలు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రణాళిక నిపుణులు సమన్వయంతో పనిచేయాలి. అభివృద్ధి పనులపై ప్రజలకు సమాచారం అందించడంతో పాటు వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక ప్రాంతంలో ఏ నిర్మాణం చేపట్టినా దాని ప్రభావం చుట్టుపక్కల ప్రజలపై ఎలా ఉంటుందో ముందుగానే అధ్యయనం చేయాలి. రాబోయే ఇరవై, ముప్పై సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్లు రూపొందించాలి. వాటిని కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలి. అక్రమ కట్టడాలు, చెరువుల ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలను అరికట్టాలి. పట్టణ ప్రణాళికలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, అధికారుల బాధ్యతాయుతమైన పనితీరు కీలకంగా మారాలి.ప్రతి పౌరుడు కూడా తన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెట్లను సంరక్షించడం, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, రహదారులను ఆక్రమించకుండా ఉండటం వంటి బాధ్యతలను నిర్వర్తించాలి. పట్టణం అభివృద్ధి చెందిందంటే ఎత్తైన భవనాలు, మెరిసే రహదారులు మాత్రమే ప్రమాణాలు కావు. స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు, పచ్చని పరిసరాలు, సురక్షితమైన రహదారులు, అందరికీ సమాన అవకాశాలు ఉన్నప్పుడే అది నిజమైన అభివృద్ధి చెందిన పట్టణంగా గుర్తింపు పొందుతుంది. నేటి అవసరాలకు మాత్రమే కాకుండా భావితరాల జీవనానికి కూడా భరోసా కల్పించేలా పట్టణాలను తీర్చిదిద్దడమే ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం అందించే ప్రధాన సందేశం.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in